సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

సేవే పరమార్థంగా..

- అభాగ్యులను ఆదుకుంటున్న వెంపాడ వెల్ఫేర్ సొసైటీ



కార్యక్రమాలకు వినియోగిస్తున్న సేవా రథం



బావికొండపై వృద్ధ దంపతులకు సరకులు అందిస్తున్న సొసైటీ వ్యవస్థాపకుడు శ్రీనివాసరెడ్డి

తగరపువలస: మీ ఇళ్లలో జరిగే ఫంక్షన్లలో భోజనం మిగిలిపోయిందా? అత్యవసర వైద్య సేవలు పొందేందుకు వాహనాలు అందుబాటులో లేవా? అర్ధ రాత్రి బస్సు దిగిన ప్రయాణికులు ఇళ్లకు చేరుకోవడానికి రవాణా సదుపాయం లేదా? ఇంకా ఎలాంటి అవసరాలైనా ఇప్పుడు మీరు చింతించక్కరలేదు. తగరపువలస కేంద్రంగా ఉచితంగా ఇలాంటి సేవలు అందించేందుకు డీసీఆర్ సేవారథం సిద్ధంగా ఉంది. ఇప్పటికే తన సేవల ద్వారా పలువురి మన్ననలు పొందిన వెంపాడ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ వెంపాడ శ్రీనివాసరెడ్డి ఈ వాహనం ద్వారా సేవలు అందించడానికి నిత్యం అందుబాటులో ఉన్నారు. ఈ సేవలు వినియోగించుకోవాలనుకునేవారు 91600 54005, 85002 64289 నంబర్లలో సంప్రదించవచ్చు.

- **మిగులు ఆహారం అభాగ్యుల చెంతకు..**

భీమిలి డివిజన్‌లోని వివిధ ఫంక్షన్లలో ఆహారపదార్థాలు మిగిలిపోతే ముందుగా గుర్తుకు వచ్చేది శ్రీనివాసరెడ్డే. మొదట్లో ప్రైవేట్ ఆటోలు, స్వచ్ఛంద సంస్థలు సమకూర్చిన వాహనాలు, పాత్రలతో మిగులు ఆహార పదార్థాలు సేకరించుకునేవారు. వీటిని మురికివాడలు, రోడ్ల పక్కన అభాగ్యులు మొదలుకుని విశాఖ నగరం వరకు పారిశుధ్య కార్మికులు, అర్ధరాత్రి భోజనం దొరకని కూలీలు, ప్రయాణికుల వరకు వీటిని పంపిణీ చేసేవారు. ఈ సేవలకు మెచ్చిన తగరపువలస డీసీఆర్ యజమాని దుర్గా శేఖర్ ఒక ఆటో సమకూర్చారు. ఇప్పుడు మరిన్ని ప్రాంతాలకు సేవా కార్యక్రమాలు విస్తరించడంతో ఆటోకు బదులుగా రూ.8 లక్షల విలువైన వ్యాన్‌ను రెండు నెలల క్రితం సమకూర్చారు. ఈ సేవా కార్యక్రమాలతో పాటు శ్రీనివాసరెడ్డి ప్రతి నెల ఒక్కో దాత నుంచి రూ.40 వంతున వసూలు చేసి 25 మంది గ్రూపు సభ్యులు అందించిన చిరుసాయంతో ఒక కుటుంబానికి 25 కిలోల బియ్యం అందిస్తున్నారు. ఇలాంటి చిరుదాతలు వందల్లో ఉండటంతో ప్రతి నెలా 50 నుంచి 80 బస్తాల బియ్యం ఎలాంటి పనులు చేసుకోలేనివారు, అనాథలు, నిరాశ్రయులకు అందిస్తున్నారు. వీటితో పాటు అదనంగా కిరాణా వస్తువులు సమకూరుస్తున్నారు. అంతే కాకుండా భీమిలి నీడీ వెల్ఫేర్ సభ్యులతో తగరపువలసలో ఫుడ్ బ్యాంకు, హెల్పింగ్ హాండ్స్ సభ్యులతో అభాగ్యుల అవసరాలు తీరుస్తున్నారు.

సేవకుడిగానే ఉంటాను..



ప్రస్తుతం నేను పని చేస్తున్న ఎన్జీవో సంస్థల ద్వారా భీమిలి లోనే కాకుండా విశాఖ, ఒడిశా ఏజెన్సీలలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాను. కొందరు స్నేహితుల సహకారంతో అనాథల భౌతిక కాయాలకు అంత్యక్రియలు చేస్తున్నాం. మేము చేస్తున్న సేవా కార్యక్రమాలకు పలువురు దాతలు కూడా చేయూత ఇస్తున్నారు.

– వెంపాడ శ్రీనివాసరెడ్డి, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్

అర్హులందరికీ పింఛన్లు

- సీఎం జగన్ పాలనలో ఎన్నడూ లేనంత సంక్షేమం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కొత్త పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు అందుతున్నాయని, ఇలా గతంలో ఎన్నడూ జరగలేదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఇక్కడ కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాలుగు వార్డుల్లో ఇప్పటి వరకు 8,666 పింఛన్లు ఇస్తుండగా ఇప్పుడు కొత్తగా 408 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు సిఫారసు చేసిన వారికి మాత్రమే పింఛన్లు అందేవని అన్నారు. కాని ఇప్పుడు అర్హత కలిగిన వారందరికీ అందిస్తున్నారని తెలిపారు. వలంటీర్లు 1వ తేదీన ప్రతి ఇంటికి వెళ్లి అందజేస్తున్నారని అన్నారు. వారి సేవలు మరువలేనివన్నారు. కరోనా సమయంలో వారు చేసిన సేవల వల్లే అనేక మంది ప్రాణాలతో ఉన్నారని అన్నారు. అటువంటి వారిపై పవన్‌కళ్యాణ్ దారుణమైన ఆరోపణలు చేస్తున్నారని, ఆయనకు చంద్రబాబునాయుడు వంత పాడుతున్నారని తెలిపారు. ఇది దారుణమన్నారు. ఎన్ని కుట్రలు చేసినా చంద్రబాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. మళ్లీ సీఎం జగన్ ప్రభుత్వం రావడం ఖాయమని అన్నారు. ముఖ్యంగా తాను నియోజకవర్గ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటు అభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలు చేస్తున్నానని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంత వరకు అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కార్పొరేటర్ దొలుపల్లి ఏడుకొండలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, మెప్మా పీడీ సంతోష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే విజయం



విద్యార్థులకు సూచనలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ రాణి సుస్మిత

కొమ్మాది: నిరంతర సాధనతోనే పోటీ పరీక్షల్లో విజయం సిద్ధిస్తుందని 2022 పబ్లిక్ సర్వీస్ కమిషన్ టాప్ ర్యాంకర్, విజయవాడ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ రాణి సుస్మిత పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కెరీర్ గైడెన్స్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ప్రతి విద్యార్థికి జీవితంలో ఏదో సాధించాలనే లక్ష్యం ఉండాలన్నారు. అది సాధించడానికి ప్రణాళికాయుతంగా కృషి జరపాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజూ తమ లక్ష్యాన్ని చేరువ చేసే విధంగా చార్టు ప్రిపేర్ చేసుకుని అందుకు అనుగుణంగా కృషి చేయాలన్నారు.

క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో కనకమ్మ



తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ శివారులో కొలువై ఉన్న కనకమ్మ ఆలయంలో అమ్మవారిని శుక్రవారం తులసిమాలలు, కాగడా పువ్వులతో అలంకరించారు. ఇదే గ్రామానికి చెందిన మాజీ సైనికుడు కొనన అప్పలచిట్టి, చిట్టితల్లి దంపతుల సహకారంలో ఈ అలంకరణ చేశారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

విశాఖ వెళ్లి పెన్షన్ అందజేత



ఆస్పత్రిలో సత్తిరాజులుకు పెన్షన్ అందిస్తున్న వలంటీర్ ఎల్లాజీ

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీకి చెందిన మత్స్యకారుడు చెల్లపల్లి సత్తిరాజులు కాలుకు శస్త్ర చికిత్స జరిగి విశాఖ ఏబీసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం అదే పంచాయతీకి చెందిన వాసుపల్లి ఎల్లాజీ అనే మహిళా వలంటీర్ నగరంలోని ఆస్పత్రికి వెళ్లి లబ్ధిదారుడికి పెన్షన్ సొమ్ము అందించింది. వలంటీర్ సేవలను భీమిలి మండలానికి చెందిన పలువురు అభినందించారు.

మృతుడి కుటుంబానికి బీమా సాయం



బీమా నగదు అందిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు పాతపరదేశిపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పి.అప్పారావు కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను శుక్రవారం కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు అందజేశారు. మృతుడి భార్య కుమారికి ఈ నగదును అందించి మిగతా రూ.90 వేల బ్యాంకు ఖాతాలో జమవుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సాడి రమణ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారం తొలగించాలని వినతి

మధురవాడ: విద్యుత్ భారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దాన్ని వెంటనే తొలగించాలని సీపీఎం జోన్ నాయకులు పి.రాజు, బి.భారతి కోరారు. ఈ మేరకు ప్రజల నుంచి సేకరించిన వినతిపత్రాలను శుక్రవారం సచివాలయంలో అందించి మాట్లాడారు. విద్యుత్ బిల్లు తీవ్రస్థాయిలో పెంచడాన్ని ఎవరూ తట్టుకోలేకపోతున్నారని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు కనకరత్నం, చిన్న, సంధ్య, సుజాత, నాగమణి పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించండి

పద్మనాభం: మండలంలోని తునివలస పంచాయతీ నరసాపురంలో జగనన్న పట్టణ గృహ అభివృద్ధి పథకానికి భూములిచ్చిన తమకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ రైతులు ఆందోళన చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమకు నష్ట పరిహారం ఇచ్చేంత వరకు ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకుంటామని నినాదాలు చేశారు. గృహ నిర్మాణాన్ని రైతులు అడ్డుకుని వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోకూడదని రైతులకు తహసీల్దార్ టి.శ్రీవల్లీ సూచించారు.

పద్మనాభానికి డీసీసీబీ బ్రాంచ్ మంజూరు



డీసీసీబీ చైర్మన్ కోలా గురువులను సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: పద్మనాభం మండలానికి డీసీసీబీ బ్రాంచ్ మంజూరైనట్టు డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు తెలిపారు. బ్రాంచ్ ఏర్పాటు కోసం పద్మనాభంలోని సచివాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని, పద్మనాభం జంక్షన్‌లోని ప్రైవేటు భవనాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ జిల్లాలో ఇంత వరకు 30 డీసీసీబీ బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. కొత్తగా 31వ బ్రాంచ్‌ను పద్మనాభానికి మంజూరు చేసినట్టు చెప్పారు. ముందుగా పద్మనాభం కో–ఆపరేటివ్ సొసైటీ కార్యాలయాన్ని కోలా గురువులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీపీ కంటుబోతు రాంబాబు దుశ్శాలువాతో సన్మానించి అనంత పద్మనాభుడి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో సీఈవో డి.వి.ఎస్.వర్మ, బ్రాంచి మేనేజర్ పూర్ణ, ఫీల్డ్ ఆఫీసర్ వై.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మొకర అప్పలనాయుడు, తాలాడ పద్మనాభం, తాలాడ నరసింహనాయుడు, పద్మనాభం, రెడ్డిపల్లి, పాండ్రంగి కో–ఆపరేటివ్ సొసైటీల కార్యదర్శులు కనకల కోటీశ్వరరావు, ముద్దాడ అప్పారావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

'అమృత్ మహోత్సవ్'కు అందరి సహకారం



సమావేశంలో పాల్గొన్న కంటుభుక్త రామానాయుడు, బీజేపీ నాయకులు

భీమునిపట్నం: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం విజయవంతానికి పార్టీ శ్రేణులందరూ సహకరించాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 75 ఏళ్ల దేశ స్వాతంత్య్రం, సమరయోధుల జ్ఞాపకార్థం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆయా ప్రాంతాల మట్టిని సేకరించి పంపాలని, దీన్ని నాయకులంతా బాధ్యతగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్, మండల అధ్యక్షురాలు కంటుభుక్త సునీత, నాయకులు నాగరాజు, రాజు, చిన్నారావు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు ఎల్ఈడీ లైట్ల వితరణ



ప్రధానోపాధ్యాయుడు మురళీమోహనరావుకు ఎల్ఈడీ లైటు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ఆవరణలో రాత్రివేళ కొందరు ఆకతాయిలు మద్యం సేవించడంతో పాటు స్కూల్ ఆస్తులకు నష్టం కలిగిస్తున్నారు. దీనిని నివారించడానికి పాఠశాలకు చెందిన 2002 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శుక్రవారం రూ.2,200 విలువైన రెండు ఎల్ఈడీ దీపాలను ప్రధానోపాధ్యాయుడు మురళీమోహనరావుకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలకు రూ.50 లక్షలకు పైగా వసతులు సమకూర్చిందన్నారు. వీటిని రక్షించుకోవలసిన అవసరం ప్రస్తుత విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులపై కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మార్గాన ప్రసాద్, బుడుమూరి వాసు, బండారు శంకర్, శ్రీను, శీరపు మురళి, కె.సతీష్, అదపాక సంతోష్, గాడు శ్రీను, వాద్ర శ్రీకాంత్, మీగడ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీల బాధ్యతలు కీలకం



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు రాఖీలు కడుతున్న ఆర్పీలు

భీమునిపట్నం: భీమిలి పరిధిలోని మహిళా సంఘాలకు చెందిన రిసోర్స్ పర్సన్లు(ఆర్పీలు) రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్పీలు ఎంతో బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నారని, వారంతా తమ కుటుంబాలతో కలిసి సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లిపిల్లి నర్సింగరావు, జీరు వెంకటరెడ్డి, కదిరి ఎల్లాజి, వాసుపల్లి కొండబాబు, అక్కరామాని రామునాయుడు, గుండాసి మధునాయుడు, ఎస్.కరుణాకరరెడ్డి, ఎస్.సరళారాణి, చిల్ల భాస్కరరెడ్డి, సిహెచ్.ప్రమీల పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో వైఎస్సార్ వర్ధంతి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ప్రతి వార్డు, పంచాయతీల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. ఈమేరకు నాయకులతో సమావేశమై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

శ్రీవారి సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



పూజలందుకున్న లక్ష్మీనారాయణస్వామి



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

కొమ్మాది: రుషికొండలోని మహాలక్ష్మి, గోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. 300 మంది మహిళా భక్తులతో అత్యంత వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు.

అష్టలక్ష్మికి విశేష పూజలు: కొమ్మాది శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే శ్రీ లక్ష్మీనారాయణ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి సుప్రభాత సేవ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ విశేష పూజల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఈ నెల 7న శ్రీ వైష్ణవ కృష్ణాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వెంకట శేషమ్మ

కొమ్మాది: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పొందుపరిచిన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవ సాధికారిక సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ అన్నారు. 8వ వార్డు ఎండాడలో శుక్రవారం భవన నిర్మాణ కార్మికులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకు తెరువు కోసం అనేక రాష్ట్రాల నుంచి కార్మికులు వస్తుంటారని, అలాంటి వారికి చట్టాలపై అవగాహన అవసరమన్నారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ సంక్షేమ మండలి అందిస్తున్న వివిధ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారికి మూడవ శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు పట్నాల సుబ్బారావు శర్మ, హరిప్రసాద్ శర్మ, మూర్తి శర్మ, హరిచరణ్ శర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకణ చేసి పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: భీమిలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్ర 4 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈఈ యు.సకరయ్య తెలిపారు. ఈ మేరకు జేవీ అగ్రహారం, నిడిగట్టు, కొత్తవలస, 33 కేవీ ఆనందపురం–ఐఎన్ఎస్ కళింగ లైన్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

'అవంతి'లో ఇండియన్ ఐడల్ శ్రీరామచంద్ర సందడి



పాట పాడుతూ..



శ్రీరామచంద్రను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం ఇండియన్ ఐడల్ శ్రీరామచంద్ర సందడి చేశారు. తాను నటించిన పాపం పసివాడు సినిమా ఓటీటీ వేదిక ఆహాలో ఈ నెలలో విడుదల అవుతున్న సందర్భంగా ప్రమోషనలో భాగంగా ఇక్కడకు వచ్చారు. కొత్త తరహాలో ఉంటున్న ఈ సినిమాలో రెండు పాటలు అందరినీ ఆకట్టుకుంటాయని శ్రీరామచంద్ర అన్నారు. ఈ సందర్భంగా తన పాటలతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శ్రీరామచంద్రను సత్కరించారు.

ఘనంగా ముగ్గురమ్మవార్ల ఆలయ వార్షికోత్సవం



అన్నదానంలో భక్తులు

మధురవాడ: మధురవాడలోని బంగారమ్మ, ఎర్నమ్మ, దండు మారమ్మ అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు నిష్టల రాంబాబు అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు, పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆలయ కమిటీ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు పిళ్లా పాపారావు, కోశాధికారి వాండ్రాసి అప్పలరాజు, సభ్యులు పిళ్లా సూరిబాబు, పిళ్లా అప్పన్న, గణపతిరావు పాల్గొన్నారు.



హెరిటేజ్ ఫెస్ట్‌లో సాంస్కృతిక కార్నివాల్



గీతాపఠన పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ఆనందపురం: మండలంలోని గంభీరం వద్ద హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం గీతా శ్లోక పఠన పోటీలు నిర్వహించారు. 1 నుంచి 4 వ తరగతి చదువుతున్న 63 మంది విద్యార్థులు ఏడు పాఠశాలల నుంచి పాల్గొన్నారు. వారణాసి విశ్వనాథం, ఇంద్రగంటి రామచంద్రమూర్తి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. 8 నుంచి 10వ తరగతి చదువుతున్న 14 పాఠశాలలకు చెందిన 305 విద్యార్థులు పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్నారు. కృష్ణాష్టమి వేడుకల నేపథ్యంలో హెరిటేజ్ ఫెస్ట్‌లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో సంధానకర్తలుగా గీతా మాతాజీ, హారిక మాతాజీ వ్యవహరించారు. అంబరీష దాస, ఆదోషజ దాస, కేశవ కృపదాస, హరి మురారిదాస, నిష్కించిన భక్త దాస పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9493185214

181 మందికి నేత్ర వైద్య పరీక్షలు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లి ఆలయ వద్ద దివీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖకు చెందిన ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ వెంపాడ రమావతి ప్రారంభించారు. 181 మందికి పరీక్షలు చేసి, అవసరమైన వారికి 15 రోజుల్లో కళ్లద్దాలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. మందులు, చుక్కలు మందులు అందించారు. కార్యక్రమంలో వెంపాడ సూరిబాబు, చుక్క శివాజీ, సరగడ ఈశ్వరరావు, సరగడ రాంబాబు, వైద్య సిబ్బంది సీతారామ్, నక్షత్ర, శ్రావణి, అరుణ్, కో ఆర్డినేటర్ స్వాములు, దివీస్ సామాజిక సేవాధికారులు కె.నరసింహారావు, హరికృష్ణ, పి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.